INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN: 2277-7881; IMPACT FACTOR – 6.014; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 8, ISSUE 8(7), AUGUST 2019

ఆంధ్ర మహాభారతం

ఆదిపర్వం – చారిత్రక ప్రదేశాలు

డా. ఎన్. మృదుల
అసిస్టెంట్ ప్రొఫెసర్
తెలుగుశాఖ
ప్రభుత్వ డిగ్రీ కళాశాల–నర్సాపూర్
మెదక్ జిల్లా.

భారతీయ జీవన విధానం – ఆధ్యాత్మిక పునాదుల మీద నిర్మించబడింది. మానవ జీవనాన్ని పరిపూర్ణం చేయడానికే కళలు, సాహిత్యం ఉద్భవించాయి. వేదాల సారాన్ని ఉపనిషత్తులు; ఉపనిషత్తుల భావాన్ని కావ్యాలు తెలియజేస్తూ ప్రజలకు మార్గనిర్దేశం చేస్తూ వస్తున్నాయి. రామాయణ భారతాలు రెండూ భారతీయ ఆత్మను పట్టిచూపించే పవిత్ర గ్రంథాలుగా ప్రసిద్ధిని పొందాయి. పంచమ వేదమైన వ్యాస ప్రోక్త మహాభారతాన్ని 12వ శతాబ్దిలో నన్నయ ఆంధ్రీకరిస్తూ –

సీ॥ ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవి వృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
యైతిహాసికులితిహాసమనియు
బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ
యంబని మహిగొనియాడుచుండ

ఆ॥ వివిధ వేద తత్త్వవేది వేదవ్యాసు
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండ జేసె భారతంబు (ఆది–1–32)

మహాభారత గ్రంథాన్ని, ధార్మికులు–ధర్మశాస్త్రమని, ఆధ్యాత్మికవేత్తలు, వేదాంత గ్రంథమని, న్యాయకోవిదులు – నీతిశాస్త్రమని, మహాకవులు – మహాకావ్యమని, లాక్షణికులు – లక్ష్యగ్రంథమని, పౌరాణికులు – బహు పురాణ సమాహారమని పేర్కొనగా, చరిత్రకారులు దీనిని ఒక ఇతిహాస గ్రంథంగా భావిస్తున్నారు. కారణం, మహాభారత గ్రంథంలో ప్రస్తావించబడిన స్థలాలు, పర్వతాలు, నదులు – ఈ దేశంలో ఒక గొప్ప చరిత్ర నడిచిన తీరును గుర్తుచేస్తాయి. పాఠకులకు ఒక దివ్యమైన అనుభూతిని అందజేస్తాయి. ఆదికవి నన్నయ వ్రాసిన ఆదిపర్వంలో, అనేక ప్రదేశాలు ప్రస్తావించబడి, భారతదేశపు ఋషులు, మునులు తాకిన మట్టికి అబ్బిన ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని వ్యక్తం చేస్తాయి.

నన్నయ ప్రస్తావించిన ప్రదేశాలను ప్రధానంగా రెండు విభాగాలుగా గుర్తించవచ్చు.

1. కథాగత ప్రస్తావిత ప్రదేశాలు
2. పాత్రగత ప్రస్తావిత ప్రదేశాలు

1. కథాగత ప్రస్తావిత ప్రదేశాలు: భారత ఇతివృత్తం చెప్పేటప్పుడు సందర్భవశాత్తు ప్రస్తావించిన వాటిని 'కథాగత ప్రస్తావిత ప్రదేశాలు'గా పేర్కొనవచ్చు. ఈ సందర్భంలో అనేక ప్రదేశాల వర్ణన జరిగింది.

1.1. నైమిశారణ్యము: భారత ఇతివృత్తం నైమిశారణ్య ప్రస్తావనతో ప్రారంభమవుతుంది. భారతీయ జీవన విధానంలో అరణ్యాల ప్రాధాన్యం – యజ్ఞయాగాదుల ప్రాశస్త్యం ఇక్కడ ప్రత్యేకంగా గుర్తించదగింది.

సీ॥ నైమిశారణ్య పుణ్యక్షేత్రమున గుల
పతి శౌనకుండను పరమమౌని
బ్రహ్మర్షి గణసముపాసితుండై సర్వ
లోక హితార్థంబు లోకసుతుడు
ద్వాదశ వార్షిక్తోత్తమ సత్రయాగంబు
మొగిజేయుచున్న నమ్మునులకడకు
వచ్చి తానుగ్రశ్రవసుడనుసూతుడు
రౌమహర్షణి సుపౌరాణికుండు

ఆ॥ పరమభక్తితోడ ప్రణమిల్లియున్నన
క్కథకు వలన ముని నికాయమెల్ల
వివిధ పుణ్యకథలు వినువేడ్క నతని బూ
జించి రపరిమిత విశేషనిధుల (I-28)

కులపతి అయిన శౌనకుడు అనే మహర్షి బ్రహ్మర్షుల సమూహంతో సేవింపబడుతూ నైమిశారణ్యంలో 'సత్రము' అనే యాగాన్ని చేశాడు. పాఠకులకు మహాభారత కథలో మొదటగా తెలిసిన ప్రాంతం ఈ నైమిశారణ్యం. ఇది ఉత్తర భారతదేశంలో పరమ పునీతమైన ప్రాంతంగా, మునులు నడయాడిన ప్రదేశంగా గుర్తింపు ఉంది.

1.2. హస్తినాపురం: శకుంతలాదుష్యంతుల కుమారుడు భరతుడు. గంగాయమునా నదీ పరివాహక ప్రాంతంలో అనేక యాగాలు చేసి దానాలు చేశాడు. తన వంశంలో పూర్వపు రాజులకు, భవిష్యత్తులో రాబోయే రాజులకు వంశకర్త కాగలిగాడు. అటువంటి భరతుడికీ కేకయ రాజపుత్రిక అయిన సునందకూ భూమన్యుడు పుట్టాడు. అతడికీ దాశార్హుడి కూతురైన విజయకూ సుహోత్రుడు జన్మించాడు. అతడికీ ఇక్ష్వాకుడి పుత్రిక అయిన సువర్ణకూ హస్తి అనేవాడు పుట్టాడు. అతడి పేరుతోనే కౌరవుల రాజధాని అయిన నగరం హస్తిపురంగా ఒప్పారింది. (I:85) ఈ హస్తినాపురాన్నే ధృతరాష్ట్రుడు రాజధానిగా చేసుకొని పాలన సాగించాడు; ఈ హస్తినాపురమే నేటి ఢిల్లీగా భారతదేశపు రాజధానిగా విలసిల్లుతుంది. ఇది భారత ఇతివృత్తానికి మూలబిందువుగానే కాక నేటి భారత రాజకీయాలకు కూడా కేంద్రమై నిలిచింది.

1.3. కులపర్వతాలు: కథలో భాగంగా, నన్నయ అనంతుని స్తుతి చేస్తూ

చ॥ బహువనపాదపాబ్ధి కులపర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహిత మహామహీభరమజస్రసహస్ర ఫణౌళి దాల్చిదు
స్సహతర మూర్తికిన్ జలధిశాయికి బాయక శయ్య యైనయ
య్యహిపతి దుష్మతాంతకుఁడనంతుడు మాకు ప్రసన్నుడయ్యెడున్ (I - 104)

'అనేక అడవులు, చెట్లు, సముద్రాలు, కులపర్వతాలు, నీటితో నిండిన సరస్సులు, నదులతో కూడిన భూమి యొక్క బరువును ఎల్లప్పుడూ వేయిపడగల సముదాయంతో ధరించి, సహింపశక్యం కాని విగ్రహం గల నారాయణుడికి విడువక శయ్యగా ఉండి, పాపాలను అంతరింపజేసే అనంతుడనే పేరుగల నాగరాజు మా పట్ల అనుగ్రహం కలవాడు అగుగాక!'

పైన పేర్కొన్న కులపర్వతాలు ఏడు. మహేంద్రం, మలయం, సహ్యం, శక్తిమంతం, గంధమాదనం, వింధ్యం, పారియాత్రం. ఈ పర్వతాలు భారతదేశమంతటా వ్యాపించి ఉండి, భారతేతివృత్తంతో ముడిపడి ఉంటాయి (I-104).

1.4. అలంబం: గరుత్మంతుడు ఒక చేత్తో తాబేటిని మరొకచేత్తో ఏనుగును పట్టుకొని, సంపంగి తీగల సమూహంతో దేవతావృక్షాలతో మనోహరమై ప్రకాశిస్తున్న 'అలంబం' అనే తీర్థానికి కొండలను కంపింపచేస్తూ వెళ్ళాడు (II-70).

1.5. రోహిణము: ఏనుగును, తాబేలును కరచి పట్టుకున్న గరుత్మంతుడిని తన కొమ్మల మీద విశ్రమించమని ఆహ్వానించిన వృక్షశ్రేష్ఠం-'రోహిణము'. ఇది అలంబం అనే పర్వత ప్రాంతాల్లో ఉంది.

1.6. గంధమాదన పర్వతం : గరుత్మంతుడు 'రోహిణం' కొమ్మ మీద వాలగానే విరిగిపోతుంది. ఆ కొమ్మ క్రిందపడితే భూమి మీద ఉన్న వాలఖిల్యులనే మునుల సమూహానికి ఎక్కడ బాధ కలుగుతుందోనని ఆ కొమ్మ నోట కరుచుకొని గంధమాదన పర్వతం మీద గరుత్మంతుడు వాలుతాడు; పాండురాజు తన ధర్మపత్నులతోనూ, భీముడు అరణ్యవాస సమయంలోనూ ఈ పర్వత సానువుల్లో విహరించినట్లు కూడా ఇతివృత్తం చెబుతుంది. ఇటువంటి పురాణ ప్రసిద్ధమైన పర్వత రాజాలు ఉత్తరభారతదేశంలో కోకొల్లలుగా ఉన్నాయి (IV-63).

1.7. వారణావతం: వారణావతంలో పాండవులకు లక్క యిల్లు నిర్మించి, అందులో పాండవులను ప్రవేశింపజేసి అంతమొందించాలని దుర్యోధనుడు భావించాడు. దుర్యోధనుడు, వారణావతంపట్ల పాండవులకు ఆసక్తి కలిగేటట్లు నేర్పరులను వర్ణించమంటాడు. "....వారణావతంబు ననవరతసురభి కుసుమ ఫల భారనమ్రశాఖా విశాల తరువనరేఖాలంకృతం బనియును, వనజలకేళీ కందుక మృగయాది వివిధ విహార హారి ప్రదేశాభి శోభితంబనియును, నవసుధా ధౌత సౌధ సుధాకర నికర ప్రభాపటల ప్రధ్వంసితాసిత పక్షదోషంబనియును, నిరస్త దోషానుషంగ మంగళ మహారత్న రాజివిరాజిత విపుల విపణివీధి విహసితాలకావిలాసం బనియును, మనోరమానేక సుఖాను భోగభోగి మహాభాగ జనసమృద్ధం బనియును, బుణ్యనదీ ప్రవాహ శోభితంబనియును వర్ణించి.... (VI-133). వారణావతం పూలు, పండ్లతో వంగిన కొమ్మలు కలిగిన చెట్లు, ఉద్యానవన విహారం, జలక్రీడ, చెండ్లాట మొదలైన ఆటలకు అనువైన మనోహర ప్రదేశాలు, చీకట్లను పారద్రోలే సౌధాలు, అలకానగర శోభను అపహాస్యం చేసే అంగడి వీధులు, పవిత్ర నదీ ప్రవాహాలతో ప్రకాశిస్తుందని నేర్పరులు వర్ణించగా పాండవులకు ఆ ప్రదేశాలలో నివసించాలనే కుతూహలం కలిగింది. ప్రదేశాల అభివర్ణన, మానసికంగా మనల్ని అక్కడికి తీసుకెళ్ళి ఆయా ప్రదేశాలను ఎప్పుడెప్పుడు చూడాలా? అన్న తపన కలిగిస్తుంది. ఇటువంటి భావనే పాండవులను వారణావతానికి వెళ్ళేట్లు చేసింది. విదురుడు అక్కడ జరగబోయే ప్రమాదాన్ని ముందే ఊహించాడు. విదురుడు చేసిన సూచనలతో ధర్మరాజు తన సోదరులను, తల్లిని కాపాడుకుంటాడు. ఈ వారణావతమే వారణాసి పట్టణం. అక్కడి శివుడే తమను కాపాడినట్లు పాండవులు భావించారు. అందుకు కృతజ్ఞతగా వారు సంచరించిన ప్రాంతాలలో శివలింగ ప్రతిష్ఠ చేసినట్లు అనేక ఉదాహరణలు కనిపిస్తాయి.

1.8. ఏకచక్రపురం: వారణావతంలో లక్కయింటి నుండి క్షేమంగా బయటపడిన పాండవులు తల్లితో కూడి, ఏకచక్రపురానికి బయలుదేరుతారు. ఇక్కడ ఉన్నప్పుడు భీముడు బకాసురుని సంహరించాడు (III-15).

1.9. పాంచాలదేశం: ఏకచక్రపురం నుండి పాండవులు ఐదుగురు బ్రాహ్మణ వేషంలో ద్రుపదుని పట్టణానికి వెళ్ళారు. ఇక్కడే మత్స్యయంత్రం ఛేదించి అర్జునుడు ద్రౌపదిని పొందాడు (III-15).

1.10. ఇంద్రప్రస్థం: ద్రౌపది వివాహానంతరం ధృతరాష్ట్రుడు వారిని రప్పించి సగం రాజ్యం ఇచ్చి ఖాండవ ప్రస్థమనే పట్టణంలో ఉండమని ఆజ్ఞాపించాడు (VIII-68). శ్రీకృష్ణుడితో కలిసి పాండవాదులు ఖాండవ ప్రస్థానికి చేరుకుంటారు. శ్రీకృష్ణుడు ఇంద్రుడిని తలచాడు. అమరావతికి దీటైన పట్టణాన్ని భూమి మీద నిర్మించమని ఇంద్రుడు దేవశిల్పి విశ్వకర్మను అజ్ఞాపించాడు. వ్యాసుడు, ధౌమ్యుడు మొదలైన వారు కొలతలు ఏర్పరచి, శాంతికర్మలు చేసిన తరువాత ఇంద్రుని ఆదేశానుసారం విశ్వకర్మ భూలోకానికి వచ్చి సాటిలేని విలాసాలతో వెలిగే, ఇంద్రప్రస్థం అనే పేరు గల మహానగరాన్ని నిర్మించాడు. ఇది ఇంద్రకుబేర వరుణ నాగరాజుల రాజధానులతో సరిపోలి ప్రకాశించింది. ఇదే నేటి హర్యాణ ప్రాంతం.

1.11. ద్వారకాపురం: సాక్షాత్తు భగవంతుడు, జగద్గురువు అయిన శ్రీకృష్ణుడు నడయాడిన ప్రాంతం–ద్వారక (III-16). భారత ఇతివృత్తంలో ప్రతివ్యూహ రచనలు ఇక్కడి నుండే సాగాయి. అర్జునుడు సుభద్రను వివాహమాడినది మొదలుగా, శ్రీకృష్ణ నిర్యాణ పర్యంతము అర్జునునికి ఈ ప్రాంతముతో ఎడతెగని సంబంధ బాంధవ్యాలున్నాయి. ద్వారకను సముద్రం ముంచివేయకముందే అర్జునుడు అక్కడి ప్రజలను కాపాడాడు. ఇప్పటికీ ఆనాటి ద్వారక ఆనవాళ్ళు నేటి గుజరాత్ రాష్ట్రంలో కనిపిస్తాయి.

1.12. చేది దేశము : వసు మహారాజు చేది దేశానికి ప్రభువు. ఈ వసు మహారాజే ఉపరిచర వసువు. ఇతని నగరానికి సమీపంలో శుక్తిమతి నది ప్రవహిస్తుంది. కోలాహల పర్వత సంపర్కం చేత ఆ నదికి గిరిక వసుపదులు జన్మించారు. శుక్తిమతీ నది వీరిద్దరినీ వసు మహారాజుకు కానుకగా ఇచ్చింది. గిరిక వసు మహారాజుల బిడ్డ – మత్స్యగంధిగా, యమునానదీతరంలో దాశరాజు వద్ద పెరిగింది. ఈ మత్స్యగంధే సత్యవతిగా పాండవ కౌరవ జనానికి మూలకారణమైనది. ఈ ఇతివృత్తము యమునానది పరిసర ప్రాంతాలలో జరిగింది కాబట్టి ఈ చేది దేశము ఉత్తర భారతదేశంలో ఉన్నదని చెప్పవచ్చు.

1.13. సరస్వతీనది: మతినారుడు అనే రాజు సరస్వతీనది ఒడ్డున పన్నెండు సంవత్సరాలు సత్రయాగాన్ని విధి విధానంతో చేశాడు. మతినారుని యందు సరస్వతీనదికి త్రసుడు జన్మించాడు. కాళింది త్రసులకు ఇలినుడు జన్మించాడు. రథంతరి ఇలినులకు దుష్యంతుడు జన్మించాడు. భరత వంశకర్త తండ్రియైన దుష్యంతజననానికి సరస్వతీనది మూలహేతువు అయ్యింది.

1.14. కురుక్షేత్రం: భరతవంశానికి చెందిన సంవరణునికి సూర్యుని కుమార్తె అయిన తపతికి 'కురుడు' జన్మించాడు. ఇతని పేరుతోనే కురుక్షేత్రం – కౌరవరాజ్యం అన్న పేర్లు ఏర్పడ్డాయి (IV-113). భీష్ముని పాలనలో కౌరవరాజ్యం గొప్పగా విలసిల్లింది. కురుక్షేత్రం ఉత్తర కురుదేశాలకంటె అధిక సంపదలతో విలసిల్లింది. అవసరమైనప్పుడు వానలు కురవటంవల్ల పాడిపంటలకు లోటు లేదు. వృక్షాలు పూలు పళ్లతో నిండాయి. ప్రజలంతా ధర్మకార్యాలమీద ఆసక్తితో పరస్పర సహకారభావంతో ఉండేవారు (V-3). అందుకే ఇది ప్రసిద్ధ పవిత్ర పర్యాటక క్షేత్రంగా నిలిచింది.

1.15. గాంధారదేశం: గాంధార రాజైన సుబలుని కూతురే గాంధారి. ఈమెను ధృతరాష్ట్రునకిచ్చి వివాహం చేశారు. ఆనాటి గాంధారదేశమే నేటి కాందహార్. మన భారత ఇతివృత్తంలో భాగమైన కాందహార్, నేడు మన ప్రక్కదేశంగా ఉన్నది.

1.16. మద్రదేశం: పాండురాజు భీష్ముని అనుమతితో మద్రిరాజు కూతురైన మాద్రిని కూడా వైభవంగా వివాహం చేసుకొన్నాడు. పాండురాజు హిమాలయ పర్వతానికి దక్షిణం వైపున ఉండే భూములలో విహరించడానికే ఇష్టపడేవాడు. ఈ హిమాలయ సానువులే ఆయనకు మోక్షాన్ని ప్రసాదించాయి.

1.17. గంగానది : మహాభారత ఇతివృత్తంలో శంతన మహారాజు కథ నుండి స్వర్గారోహణ పర్వం వరకు గంగానది ప్రస్తావన కనబడుతుంది. హిమాలయ శిఖరాల నుండి భూమికి వచ్చిన గంగ సముద్రంలో కలిసింది. ఆకాశమార్గంలో మందాకిని అనే పేరుతో ప్రసిద్ధమై దేవతలు, సిద్ధులు, మునులు మొదలైన ఆకాశ సంచారులచేత సేవింపబడుతుంది. పాతాళలోకంలో భోగవతి అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. భరతకులంలో పుట్టిన ప్రతీప మహారాజు గంగానదీ తీరంలో (III-133) తపస్సు చేస్తుండగా గంగాదేవి రాజుతో తన వాంఛను తెలియజేసింది. అందుకు రాజు అంగీకరించలేదు. ఆ తరువాత కొంతకాలానికి తనకు జన్మించిన శంతనుణ్ణి గంగను వివాహం చేసుకోమని చెప్పాడు. వీరిద్దరికీ జన్మించిన వాడే భీష్ముడుగా పిలవబడిన దేవవ్రతుడు. భారతేతి వృత్తానికి ప్రధాన పురుషుడు.

1.18. కన్యాకుబ్జం: పూర్వం కన్యాకుబ్జంలో గాధికుమారుడు అయిన విశ్వామిత్రుడు అనే రాజు పరిపాలిస్తున్నాడు (VII-96). అతడొక రోజు సైన్యంతో అరణ్యంలో తిరిగి, తాపంతో విశ్రాంతి కొరకు వసిష్ఠుని ఆశ్రమం చేరాడు. వశిష్ఠుడు ఆ రాజుకు ఆతిథ్యం ఇచ్చాడు. మహర్షి హోమధేనువైన నందిని విషయమై వీరిద్దరి మధ్య ఘర్షణ ఏర్పడింది. చివరికి వసిష్ఠుడు తన తపోబలమే ఘనమైనదని నిరూపించాడు. కన్యాకుబ్జం నేటి కన్యాకుమారిగా విలసిల్లుతుంది.

2. పాత్రగత ప్రస్తావిత ప్రదేశాలు : కథలో పాత్రలు (వ్యక్తులు, పాండవాదులు మొ॥) అంతర్భాగమైనప్పటికీ ఆయాపాత్రలు ప్రత్యేకించి సందర్శించిన ప్రదేశాలు కొన్ని ఉన్నాయి. పాండురాజు, అర్జునుడు వివిధ ప్రదేశాలను చూచినట్లు ఆదిపర్వం తెలుపుతుంది.

2.1. పాండురాజు దర్శించిన ప్రదేశాలు

2.2. అర్జునుడు సందర్శించిన ప్రదేశాలు

2.1. పాండురాజు దర్శించిన ప్రదేశాలు: పాండురాజు స్వభావరీత్యా ప్రకృతిపట్ల ప్రేమభావన కలవాడు. ధృతరాష్ట్రుడు రాజ్యపాలన చేస్తుండగా, పాండురాజు యుద్ధాలు చేస్తూ, వివిధ ప్రదేశాలను సందర్శించేవాడు. ఇటువంటి సందర్భాలలోనూ శాపకారణాలతోనూ పాండురాజు తన భార్యలతో రమణీయమైన ప్రకృతి ప్రదేశాలను చూశాడు.

2.1.1. నాగశైలము : హిమాలయ పరిసర ప్రాంతాల్లో ఉండే శైలమిది (V-63). పాండురాజు తిరిగిన ప్రాంతమిది.

2.1.2. చైత్రరథము : ఇంద్రుని రథము పేరుతో ఉన్న మరొక పర్వత ప్రాంతాన్ని పాండురాజు దర్శించాడు (V-63).

2.1.3. పారిషేణము : చైత్రరథానికి సమీపంలోనే ఉన్న మరొక పర్వతము పారిషేణము (V-63). దీనిని కూడా పాండురాజు దర్శించాడు.

2.1.4. హిమవంతము: పారిషేణ పర్వతానికి ఉత్తర భాగంలో ఉండే హిమవంతాన్ని పాండురాజు చూశాడు (V-63).

2.1.5. గంధమాదన పర్వతము: సురలు సిద్ధులు సేవించిన పర్వతము, గంధమాదన పర్వతము. ఈ పర్వత ప్రాంతంలో పాండురాజు కొన్నిరోజులున్నాడు (V-63).

2.1.6. ఇంద్రద్యుమ్నము : ఇది ఒక కొలను (V-63). ఈ కొలను వద్ద పాండురాజు కొన్నిరోజులు గడిపి ప్రయాణం సాగించాడు.

2.1.7. హంసకూటము: ఒక్కొక్క ప్రాంతాన్ని దర్శిస్తూ పాండురాజు, దేవభూములకు దగ్గరగా ఉన్న హంసకూటానికి చేరుకున్నాడు (V-63). శాపగ్రస్తుడైన పాండురాజుకు ప్రకృతి తప్ప మరొకటి సేదదీర్చలేదు. అంతటి శక్తి హిమాలయ పరిసరాలకున్నదని ఈ ఘట్టం ఋజువు చేస్తుంది.

2.1.8. శతశృంగం: సిద్ధులు, దేవతలు, యక్షులు సేవించే ఎత్తైన శిఖరాలు కలిగిన శతశృంగమనే పర్వతం మీద పాండురాజు ఘోరతపస్సు చేశాడు (V-65). ఈ శతశృంగం మీదే కుంతికి ధర్మరాజాదులు, మాద్రికి కవలలు జన్మించారు.

2.2. అర్జునుడు సందర్శించిన ప్రదేశాలు: ద్రౌపదితో వివాహం జరిగిన తరువాత, పాండవులు, నియమబద్ధమైన జీవితం గడుపుతున్న సందర్భంలో అర్జునుడు సమయభంగం చేశాడు. అందుకు ప్రాయశ్చిత్తంగా ద్వాదశ మాసిక వ్రతం చేశాడు. ఇందులో భాగంగా అనేక పుణ్యతీర్థాలను దర్శించాడు.

2.2.1. గంగాద్వారం: నియమభంగం కారణంచేత అర్జునుడు ధర్మరాజు వద్ద అనుమతి తీసుకొని పరమ యోగులను వెంటబెట్టుకొని గంగానది వద్దకు వెళ్ళి గంగాద్వారంలో తన పాపాలు తొలగిపోయేటట్లు సేవించాడు (VIII-126). ఈ గంగాద్వారమే హరిద్వార్.

2.2.2. అగస్త్య వటక్షేత్రం : అగస్త్యమహర్షి తపస్సు చేసిన వృక్షం ఇది. (VIII-135) హిమాలయం ప్రక్కన ఉన్న అసగ్యవటక్షేత్రాన్ని అర్జునుడు దర్శించాడు.

2.2.3. భృగుతుంగ క్షేత్రం: అర్జునుడు అగస్త్యవట క్షేత్రం తరువాత భృగుమహర్షి తపమాచరించిన భృగుతుంగ క్షేత్రాన్ని దర్శించాడు (VIII-135).

2.2.4. హిరణ్యబిందు తీర్థం : అర్జునుడు భృగుతుంగ క్షేత్ర ప్రదర్శనం తరువాత బంగారువర్ణంతో భాసించే హిరణ్య బిందుతీర్థంలో గోదాన భూదాన, సువర్ణ దానాది అనేక దానాలు చేసి యజ్ఞం కొరకు బ్రాహ్మణోత్తములకు వేలాది ఆవులను ఇచ్చాడు (VIII-135). తీర్థక్షేత్రాల్లో చేసిన దానాలకు అధికఫలమని శాస్త్ర ప్రమాణం. అనేక పుణ్యక్షేత్ర దర్శనం చేత మనలో కూడా త్యాగచింతన, దేవునిపై ప్రేమ పెరుగుతాయి తద్వారా ప్రతిఫలరహితంగానే అనేక పవిత్రకార్యాలు చేపడతాము.

2.2.5. ఉత్పలిని: గంగ యొక్క ఉపనది అయిన ఉత్పలిని ని అర్జునుడు సేవించాడు (VIII-137).

2.2.6. కౌశిక : విశ్వామిత్రుని పేరుతో ఏర్పడిన ఉపనది ఇది. దీనిని అర్జునుడు సేవించాడు (VIII-137).

2.2.7. నంద : ఇక్కడ గంగ ఆనందం కలిగిస్తూ హొయలొలుకుతూ ప్రవహిస్తుంది (VIII-137). దీనిని దర్శించాడు అర్జునుడు.

2.2.8. అపరనంద: గంగానది అపరనంద అని పిలబడే ప్రాంతంలోనూ అర్జునుడు సేదదీరాడు (VIII-137).

2.2.9. గయ : అత్యంత పవిత్రస్థలమిది. శ్రాద్ధకర్మలకు విహిత ప్రదేశమిది (VIII-137). ఈ ప్రాంతాన్ని కూడా అర్జునుడు దర్శించాడు.

2.2.10. గంగాసాగరస్థలం: శంతన మహారాజు వలన అష్ట వసువులకు జన్మనిచ్చిన తల్లి గంగాదేవి. అష్టవసువుల్లో చివరివాడే భీష్ముడు. అర్జునుడు. గంగాదేవికి నమస్కరించి గంగాసాగర స్థలానికి బయలుదేరాడు.

కం॥ ఏలా వనరమ్యములగు
వేలావనములను బవనవిచలద్వీచీ
లాలితసముద్రవిద్రుమ
మాలాపులిన స్థలముల మసలుచు లీలన్ (VIII-137)

అని గంగాసాగర రమణీయాన్ని నన్నయ వర్ణిస్తాడు. ఏలకి తీగల తోటలు, సముద్ర తీర వనాలు, పగడపు చెట్ల వరుసలు ఇసుకతిన్నెల ప్రదేశాలతో విలాసంగా ఈ సాగర స్థలం ఉన్నదట.

2.2.11. కళింగదేశం: అర్జునుడు సాగరసంగమ స్థలం నుండి కళింగదేశం చేరుకున్నాడు. అతని వెంట వచ్చిన కొందరు బ్రాహ్మణులు కళింగదేశ ద్వారం నుండి తిరిగి ఉత్తర కురుదేశాలకు వెళ్ళారు (VIII-138). ఇతర బ్రాహ్మణుల సహాయంతో అర్జునుడు తూర్పు సముద్రతీరంలో ఉన్న జగన్నాథస్వామిని ఆరాధించాడు. ఈ కళింగదేశం నేటి ఒరిస్సా రాష్ట్రంలో ఉంది. అర్జునుడు సేవించిన జగన్నాథుడే పూరీజగన్నాథుడు.

2.2.12. మహేంద్రపర్వతం: అర్జునుడు జగన్నాథ క్షేత్రానికి దక్షిణంలో ఉన్న మహేంద్ర పర్వతాన్ని దర్శించాడు (VIII-138). మహేంద్రగిరులుగా నేడు పిలువబడుతున్నాయి.

2.2.13. గోదావరి : అర్జునుడు దక్షిణ భారతంలో నిండుగా ప్రవహిస్తున్న గోదావరిని దర్శించాడు (VIII-139).

2.2.14. భీమేశ్వరుడు : శివుడు ఆద్యంతరహితుడు అని చాటి చెప్పే భీమేశ్వర లింగాన్ని, అర్జునుడు దర్శించాడు (VIII-139). ఇది తూర్పు గోదావరి జిల్లాలో విలసిల్లుతుంది.

2.2.15. శ్రీశైలం : అర్జునుడు మల్లికార్జుని దర్శించినట్లుగా భారతం చెబుతుంది (VIII-139). ఇది నేటి కర్నూలు జిల్లాలో ఉంది.

2.2.16. వేంగీదేశము : నన్నయ ఇన్ని ప్రాంతాలు చూచిన అర్జునుణ్ని రాజరాజనరేంద్రుని రాజ్యానికి కూడా రమ్మని పిలిచాడు. ఈ వేంగీదేశాన్ని అర్జునుడు చూచినట్లు అమూలకంగా వ్రాశాడు (VIII-139) నన్నయ.

2.2.17. కావేరీ సముద్ర సంగమం : వేంగీదేశ వైభవాన్ని చూచిన తరువాత అర్జునుడు దక్షిణ సముద్రతీరానికి వెళ్ళి కావేరీ సముద్ర సంగమంలో బ్రాహ్మణ శ్రేష్ఠులకు ఇష్టమైన దానాలన్నీ ఇచ్చాడు (VIII-139). ఈ విధంగా తూర్పుతీరంలోనూ దక్షిణతీరంలోనూ దానాలు ఇచ్చి ఆయా సమయాల్లో, స్థలాల్లో చేయదగిన కార్యాలను చేయడంలో విజయుడయ్యాడు. ఈ కావేరీ తీర్థమే రామేశ్వరంగా ప్రసిద్ధి పొందింది. ఉత్తరాన గంగానది నుండి రామేశ్వరానికి వచ్చి, తిరిగి ఉత్తరాదికి ప్రయాణం చేస్తున్న అర్జునుడు, ఒక ఆవర్తాన్ని పూర్తిచేసుకున్నాడని చెప్పవచ్చు.

2.2.18. మణిపుర నగరం: అర్జునుడు ద్వాదశ మాసిక వ్రతం పూర్తి చేసుకొని పదమూడవ మాసంలో మణిపురమనే నగరానికి వెళ్ళాడు (VIII-140). ఇది నేటి మణిపూర్‌గా భాసిల్లుతుంది.

2.2.19. సౌభద్రతీర్థం : అర్జునుడు తపోధనులైన బ్రాహ్మణులతో కలిసి మణిపూర పురానికి దగ్గరగా ఉన్న సముద్ర తీర తీర్థాలను చూస్తూ సౌభద్ర తీర్థాన్ని (VIII-148) చేరుకున్నాడు.

2.2.20. పౌలోమ తీర్థం : అర్జునుడు సౌభద్ర తీర్థానికి దగ్గరగా ఉన్న పౌలోమతీర్థాన్ని దర్శించాడు (VIII-149).

2.2.21. కారంధమతీర్థం: అర్జునుడు పౌలోమతీర్థాన్ని చూచిన తరువాత కారంధమ తీర్థానికి వెళ్ళాడు (VIII-149).

2.2.22. ప్రసన్నతీర్థం : అర్జునుడు పై మూడు తీర్థాలు చూచిన తరువాత ప్రసన్న తీర్థాన్నీ చూచాడు (VIII-149).

2.2.23. భరద్వాజ తీర్థం: సౌభద్రాది పంచమతీర్థాలకు నారీతీర్థాలని పేరు. కుబేరుని స్నేహితురాలైన వంద, ఆమె నలుగురు స్నేహితులు శాపవశాత్తు మొసళ్ళుగా మారి ఆ తీర్థాలలో ఉన్నారు. అర్జునుడు స్నానం చేయడం వలన అయిదుగురికి శాపవిమోచనం కలిగింది. ఆ తరువాత అర్జునుడు తిరిగి మణిపూర నగరానికి వెళ్ళాడు (VIII-163). ఇటువంటి తీర్థయాత్రల వలన ఆధ్యాత్మిక శక్తిని మనం పెంపొందింపజేసుకోవడమే కాక అక్కడి ప్రజల స్థితి గతుల్లోనూ మార్పులు తీసుకురాగలమని భావించవచ్చు.

2.2.24. గోకర్ణ తీర్థం : మణిపూర నగరం నుండి బయలుదేరి అర్జునుడు గోకర్ణ తీర్థాన్ని చూశాడు (VIII-163). ఇది ఉత్తర భారతదేశంలో ఉన్నది.

2.2.25. ప్రభాసతీర్థం : అర్జునుడు గోకర్ణ తీర్థాన్ని చూస్తూ పడమటి సముద్రం ప్రక్కన ఉన్న ప్రభాస తీర్థానికి వెళ్ళాడు. భీష్ముని పేర వెలసిన తీర్థమిది (VIII-163).

2.2.26. రైవతకాద్రి: అర్జునుడు ప్రభాసతీర్థంలో ఉండగా శ్రీకృష్ణుడు అతని వద్దకు వెళ్ళి ద్వారకానగరానికి తీసుకొచ్చాడు. అక్కడ ఉన్న రైవత కాద్రి గుహలో అర్జునుణ్ణి ఉంచాడు.

ఉ. భ్రాజితశాత కుంభగృహపంక్తుల బుష్పిత వల్లివేల్లితో
రీ్వజన నావృత్తిన్ విమల విద్రుమ వజ్ర విచిత్ర వేదికా
రాజిగరంబు రమ్యమగు రైవతకాచలకందరంబునన్
రాజకులైక సుందరు బురందరనందను నుంచి లీలతోన్ (VIII-171).

మెరుస్తున్న బంగారు వన్నెల మేడలు, పూసిన తీగలు పెనవేసుకున్న చెట్లతో కూడిన ఉద్యానవనాలు, పగడాలు, వజ్రాలు తాపిన చిత్రవిచిత్రాలైన అరుగులతో ఎంతో అందమైనది రైవతకాద్రి అని నన్నయ వర్ణిస్తాడు.


2.2.27. అంతర్వీపం: సుభద్రార్జునుల వివాహం చేయనిశ్చయించిన ప్రదేశమిది. శ్రీకృష్ణుడు శివ పూజానెపంతో అఖిల యాదవ భోజాంధక వృష్ణి వంశ శ్రేష్ఠులతో అంతరద్వీపానికి వెళ్ళాడు (VIII-190).

2.2.28. ఖాండవవనం: 'ఖాండవవన సమీపంబున నొక్క చందన లతాభవన చంద్రకాంత వేదికయందు మందశీతల సురభిమారుతంబమనుభవించుచు... అని నన్నయ ఖాండవవనం నుండి వీస్తున్న గాలిని వర్ణిస్తాడు. ఈ పిల్లగాలులను శ్రీకృష్ణార్జునులు ఆస్వాదిస్తుండగా అగ్నిదేవుడు బ్రాహ్మణవేషంలో వచ్చి ఖాండవదహనంతో తన అజీర్తిని పోగొట్టుకోవాలని చెబుతాడు. బ్రహ్మదేవుడు సూచించిన ఆ వ్యాధినివారణ మార్గానికి అగ్నిదేవుడు కృష్ణార్జునుల సహాయాన్ని కోరతాడు. దేవేంద్రుడు ఎన్ని ప్రతికూల పరిస్థితులు కల్పించినా, తక్షకుడిచేత పటిష్టమైన భద్రత

కలిగించినా ఆ ఖాండవ దహనానికి శ్రీకృష్ణార్జునులు సంపూర్తిగా సహకరిస్తారు. యమునానదికి సమీపంలో ఈ ఖాండవవనం ఉన్నట్లుగా ఈ ఇతివృత్తం తెలియజేస్తుంది.

మహాభారత కాలంనాటి భారతదేశ భౌగోళిక స్వరూపాన్ని కింది చిత్రపటంలో చూడవచ్చు.

(సుబ్రహ్మణ్యశాస్త్రి, పెండ్యాల, పేజి.216ఎ)



ఈ విధంగా కథాగతంగాను, పాత్రలగతంగానూ ఎన్నో స్థలాల వర్ణనలు ఆదిపర్వంలో కనిపిస్తాయి. పర్వతాలు, నదులు, సరస్సులు, జనవాసాలు ఎన్నింటినో నన్నయ ప్రారంభ పర్వంలో వర్ణించాడు. ఇటువంటి వర్ణన పాఠకునికి ముందు జరగబోయే ఇతివృత్తంపై ఆసక్తిని కలుగజేస్తుంది. శ్రవ్యకావ్యమైనా దృశ్య కావ్యమైనా, స్థల వర్ణన–స్థల చిత్రీకరణ మనసుకు, కంటికి ఆనందాన్ని కలిగించి మనోఫలకంపై చెరగని ముద్ర వేస్తాయి. ఆయా స్థలాల దర్శనం – కంటికి ఆనందం కలిగించటం ప్రాథమిక లక్షణం అయితే ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించటం ఆత్యంతిక లక్షణం. పాండురాజు రాజభోగాలను వదిలి నిరంతరం ప్రకృతితో మమేకమైనవాడు కాబట్టే పంచభూతాలకు ప్రతీకలైన పాండవులను పొందగలిగాడు. స్వర్గనివాసానుభూతినీ పొందాడు. అర్జునుడు ప్రాయశ్చిత్తంలో బాగంగా ఉత్తర దక్షిణ భారతాలను దర్శించాడు కాబట్టే అనేక సిద్ధులు, వరాలు పొందగలిగాడు. అంతేకాదు భారతీయ వాఙ్మయంలో, రామాయణ భారతాలు, రామునికి, పాండవులకు వనవాసానంతరం రాజ్యాన్ని అందించాయి. ప్రజల స్థితిగతులు తెలుసుకున్న తరువాతే ఒక రాజుకు అసలైన రాజ్యార్హత కలుగుతుందనే సామాజిక సూత్రం, ఈ సందర్భం తెలియజేస్తున్నా, అంతకుమించి సంచారశీలత అభివృద్ధికి సూచకమని కూడా గుర్తించాలి. పూర్వపు కథల్లో రాజకుమారుడు అనేక రాజ్యాలు చూచి పేదరాశి పెద్దమ్మ వల్ల స్థానిక విశేషాలు తెలుసుకొని, ఒకానొకరాజుని మెప్పించటం, యువరాణిని పొందటం – సింహాసనాన్ని అధిష్ఠించటం మనకు తెలిసినవే. నేటికీ అనేకమంది రాజకీయ నాయకులు పాదయాత్రలు చేసి పదవులను పొందటం ఈ సందర్భంలో విశేషంగా గుర్తుచేసుకోదగిన విషయం.

ఈ విధంగా నన్నయ (వ్యాస) భారతం ఆదిపర్వంలోనే దర్శనీయ స్థలాలకు పునాది వేసి స్వర్గారోహణం వరకు అనేక స్థలాలను మానసికంగా దర్శింపచేస్తూ పఠితకు మన చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని వివరిస్తూ ఒక అలౌకికానందాన్ని అందిస్తుందని చెప్పవచ్చు.

ఉపయుక్తగ్రంథసూచి:

1. ఉషశ్రీ, 1996, భారతంలో నీతికథలు, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.
2. కోటీశ్వరరావు, తుమ్మపూడి (అను) 2003, హిందూమతసారాంశం, శ్రీరామకృష్ణమఠం, చెన్నై
3. చన్నశేఖరశాస్త్రి, మల్లాది, 1990, మహాభారతము, ధర్మసూక్ష్మదర్శనము, హైదరాబాదు
4. నన్నయభట్టారకుడు, ద్వితీయ ముద్రణ, 2006, కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.
5. వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పెండ్యాల, ద్వితీయ ముద్రణ, 1994, మహాభారత చరిత్రము, విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాద్.